క్లుప్తంగా

బాలసుబ్రహ్మణ్యంకు నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

కందుకూరు: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 5వ వర్ధంతిని ఆయన అభిమాని బాలమల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలసుబ్రహ్మణ్యం తన పాటలతో ప్రజల మనసుల్లో స్థిరస్థాయిగా ఉంటారని చెప్పారు. ఆయన లేని లోటు సినీ ప్రపంచంలో కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జి.సుధాకర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బడంగ్‌పేట్: మున్సిపాలిటీలోని 5వ డివిజన్ వినాయకహిల్స్ కాలనీకి చెందిన చంద్రశేఖర్ అనారోగ్యానికి గురికాగా.. హాస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకొని కుదుటపడ్డారు. ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే సబితారెడ్డి బాధితుడికి చెక్కు అందజేశారు. బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ బోయపల్లి శేఖర్‌రెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు

కందుకూరు: అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఛలో సెక్రటేరియేట్ కార్యక్రమానికి వెళ్లకుండా మండల పరిధిలోని అంగన్‌వాడీలను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేసి, పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బి.శ్రీనివాస్ మాట్లాడారు. సమస్యలపై గళమెత్తకుండా గొంతు నులిమే పనులను ప్రభుత్వం పోలీసుల ద్వారా చేపట్టడం హేయమైన చర్యని విమర్శించారు. అధికారంలోకి రాకముందు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడు ఈవిధంగా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇచ్చిన హామీల మేరకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

కాలనీకి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

మహేశ్వరం: ప్రగతి నగర్ కాలనీకి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అయిన సందర్భంగా ఏతఃచక్రపాణిని గురువారం ఆ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. చాలా కాలంగా విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతూ.. సమస్యను పరిష్కరించాలని ఏతః దృష్టికి తేగా.. కొత్తగా ట్రాన్స్‌ఫారం మంజూరు అయిందని కాలనీ వాసులు పేర్కొన్నారు. ఇందులో కాలనీ వాసులు దత్తు నాయక్, రవీందర్‌రెడ్డి, సీతారామ్ నాయక్ పాల్గొన్నారు.

కోమటికుంట చెరువు వద్ద పిచ్చిమొక్కల తొలగింపు



కోమటికుంట చెరువు చుట్టూ పెరిగిన గడ్డిని తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

బడంగ్‌పేట్: మున్సిపాలిటీలోని అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు చుట్టూ పేరుకుపోయిన గడ్డిని, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను పారిశుద్ధ్య సిబ్బంది గురువారం తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పాల్గొని సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు హెల్త్ కిట్లను అందజేస్తామన్నారు. కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు.

ఆలయాల ఆధునికీకరణకు ప్రాధాన్యం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఐఎస్‌సదన్‌లోని సాయినగర్ కాలనీ నల్లపోచమ్మ దేవాలయంలో పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. సాయినగర్ కాలనీవాసుల వినతి మేరకు నల్లపోచమ్మ దేవాలయంలో రూ. 4.91 లక్షలతో షెడ్ రూఫ్, ఎస్ఎస్ ఫ్లోరింగ్ పనులు ప్రారంభించామని ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, ప్రకాష్, సాయి, సుధాకర్, సందీప్, జమున, కేశవ్, రాహుల్, రాఖీ పాల్గొన్నారు.

పేదల బస్తీలకు సుస్తీ!

పేదల బస్తీలకు సుస్తి చేసింది. ఓ వైపు ఏకధాటి వర్షాలు. మరో వైపు వాతావరణంలో వచ్చిన మార్పులు. దానికి తోడు దోమల విజృంభణ వెరసి.. ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

- సరూర్‌నగర్ డివిజన్‌లో డెంగీ పంజా
- చాపకింది నీరులా విస్తరిస్తున్న ఫీవర్
- ఆస్పత్రులకు రోగుల తాకిడి
- మూడు నెలల్లో 45 కేసుల నమోదు
- ఫాగింగ్ మరచిన మునిసిపల్ అధికారులు



సరూర్‌నగర్ పీహెచ్‌సీలో ఓపీలో రోగుల క్యూ..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి పలు కాలనీల్లో సీజన్ వ్యాధ్యులు విజృంభిస్తున్నాయి. చాపకింది నీరులా విస్తరిస్తూ.. ప్రజలను మంచాన పడేస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరు దగ్గు, జలుబు, జ్వరం, ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు. ఇప్పటి వరకు అధికారికంగా జూలై 16, ఆగస్టులో 25, సెప్టెంబర్‌లో నాలుగు కేసులు మొత్తం 45 డెంగీ కేసులు నమోదు కాగా, అనధికారికంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆస్పత్రి అవుట్ పేషంట్ విభాగానికి సగటున 500 మంది రోగులు వస్తుండగా, వీరిలో సగానికిపైగా జ్వరపీడితులే కావడం విశేషం.

కంటికి కునుకు కరువు

ప్రస్తుత సీజన్‌లో వర్షాలు, వరదల కారణంగా ఖాళీ స్థలాల్లో భారీగా వరదనీరు చేరి నిల్వ ఉండటం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో డెంగీ దోమలు పెరుగుతున్నాయి. వాటి నియంత్రణకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు.. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దోమల దాడితో డివిజన్‌లోని పేదల బస్తీలైన భగత్‌సింగ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, శంకర్‌నగర్‌తో పాటు.. డాక్టర్స్ కాలనీ, జేబీ కాలనీలోని ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. ఇదిలా ఉండగా..అత్యవసర సమయాల్లో సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంబేద్కర్‌నగర్, భగత్‌సింగ్ నగర్ బస్తీదవాఖానలకు వెళ్తే కనీస మందులు అందుబాటులో లేవని బాధితులు పేర్కొంటున్నారు.

ప్రైవేటులో దోపిడీ

వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు సులభంగా సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఏ మాత్రం ఆరోగ్యం క్షీణించినా.. రక్త పరీక్షలు చేయించుకోవాలి. డెంగీ అయితే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది. కానీ.. భగత్‌సింగ్‌నగర్, అంబేడ్కర్‌నగర్లోని ఆస్పత్రుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే వైద్య సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఆ తరువాత రోగులు ప్రైవేటుకు పరుగులు తీయాల్సి వస్తోంది. డెంగీపై ప్రజల్లో ఉన్న భయాన్ని డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు. అవసరం లేకపోయినా ప్లేట్‌లెట్ కౌంట్ టెస్టులు చేస్తూ.. పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తాజా ఆహారాన్ని తీసుకోవాలి. చిన్నారుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. డెంగీ దోమలు పగటి పూట కుడతాయి. ఈ సమయంలో పిల్లలు నిద్రపోయే అవకాశం ఉంది. దోమ తెరలు వాడటం, శరీరం పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేయాలి. ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యులను సంప్రదించండి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– అర్చన, మెడికల్ ఆఫీసర్, సరూర్‌నగర్

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి



ఆలయం వద్ద మొక్కలు నాటుతున్న సబితారెడ్డి

తుక్కుగూడ: మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం పురపాలిక పరిధిలోని జెన్నాయిగూడ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే జమ్మి చెట్టు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సంతోష్‌కుమార్ గ్రీన్ ఛాలెంజ్ మేరకు ఆలయం వద్ద మొక్కలు నాటామన్నారు. విజయదశమి రోజు జమ్మి చెట్టును దర్శించుకోవడం మన సంప్రదాయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆలయాల వద్ద మొక్కలు నాటి, పెంచాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తుక్కుగూడ పుర అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు బీమా కల్పించాలి

మన్సూరాబాద్: ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పెండెం కృష్ణకుమార్ స్వతంత్రంగా మెడికల్ షాపులను నిర్వహిస్తున్న మహిళా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్‌లను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా లాంటి కష్టకాలంలోనూ ఫార్మాసిస్టులు విధులు నిర్వహించారని, వారి సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో డాక్టర్లు ముందుండగా ఫార్మాసిస్టులు సహకారం అందించారని తెలిపారు. కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్‌కు ప్రభుత్వం బీమా కల్పించాలని కోరారు.

ఘనంగా విష్ణు సహస్ర పారాయణం



స్వామివారి ఊరేగింపులో ఆలయ కమిటీ, గ్రామస్తులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఉదయం హవనము, బలిహరణము, సాయంత్రం హనుమంత సేవ తదితర పూజా కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. బుధవారం రాత్రి ఆలయం నుంచి మామిడిపల్లికి చేరుకొని, గ్రామ పురవీధుల్లో కొనసాగిన గరుడవాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కళ్లం నరేశ్‌గౌడ్, కమిటీ సభ్యులు చెన్నయ్య, శేఖర్, అనిత, భాస్కర్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు షురూ



అమ్మవారి పూజలో కమిటీ సభ్యులు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్ యూపీహెచ్‌పీ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యాచార్యుల ఆధ్వర్యంలో గురువారం సుప్రభాత సేవ, వేదపారాయణం, గోపూజ కలశతీర్థం, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, అంకుర్పారణ, సర్వదేవతా మండపారాధనలు, అగ్నిప్రతిష్ఠ, అర్చనలు నిర్వహించారు. సభ్యులు కోశిక శ్రీనివాసరావు, బోనగిర చంద్రశేఖర్, నర్సింహచారి, రాజ్‌కుమార్, జంగయ్యగౌడ్, మురళీధర్, యాదయ్యయాదవ్, శంకర్ సింగ్, పృథ్వీసింగ్, గోవింద్ సింగ్, రూప్‌సింగ్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బతుకమ్మ సంబురాల సందడి



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ఆదేశాను సారం ప్రత్యేకాధికారి జి.వెంకట్‌నారాయణ, కమిషనర్ బి.వెంకట్రామ్ పర్యవేక్షణలో ఆర్ఓ జ్యోతిరెడ్డి, జేఏఓ సంధ్య, కార్యాలయ సిబ్బంది బాలమణి, పొదుపు సంఘాల మహిళలు సంప్రదాయ వస్త్రాధారణతో తీరొక్క పూలతో పూల సింగిడిలను పేర్చారు. పురపాలిక సంఘం కార్యాలయ ఆవరణలో ప్రతిష్ఠించి బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. అనంతరం నిమజ్జనం చేశారు.



ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం సువర్ణ పుష్పార్చన, ప్రాబోధిక ఆరగింపు, యాగశాలలో మూర్తి కుంభావాహన, చతుస్థానార్చన, గరుఢాది వాసం, అగ్నిప్రతిష్ఠ, గరుఢ హోమం, ధ్వజారోహణ, శ్రీవారి కల్యాణం, అన్నప్రసాద వితరణ, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, గణపతి, జగదీశ్‌కుమార్, పాపారావు, సత్తయ్య, శ్రీధర్, శ్యామల, రామలక్ష్మి, సాంబశివరావు, సునీల్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, రమేష్‌బాబు, అశోక్ కుమార్, జయసూర్య, అనూప్‌కుమార్ పాల్గొన్నారు.



మీర్‌పేట బీజేపీ క్వార్టర్స్‌లో దీన్‌దయాళ్ జయంతి వేడుకలో పాల్గొన్న నాయకులు



కందుకూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

దీన్ దయాల్ ఆశయ సాధనకు కృషి

మీర్‌పేట: సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్న దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలు, సిద్ధాంతాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ అందెల శ్రీరాములుయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని స్థానిక బీజేపీ-2 అధ్యక్షుడు ముఖేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ మీర్‌పేట క్వార్టర్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్‌తో కలిసి శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, భిక్షపతిచారి, సోమేశ్వర్, గాజుల మధు, రవినాయక్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, రాఘవేందర్ ముదిరాజ్, కాశీరాం, హైందవిరెడ్డి, లతశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

కందుకూరు: దీన్ దయాల్‌ను పార్టీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకుడు పండిత్ దీన్ దయాల్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కందుకూరు చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణగౌడ్, టి.లక్ష్మణ్‌ముదిరాజ్, ఎస్.మల్లా రెడ్డి, టి.జగదీశ్వర్‌రెడ్డి, జి.రాజేందర్ రెడ్డి, ఎం.పాండు, జి.ప్రభాకర్, రఘునందన్, ఎస్.వెంకటేశ్, బి.మల్లేశ్, వెంకట్‌రెడ్డి, కె.సుధాకర్ రెడ్డి, కె.చెన్నారెడ్డి, నారాయణ, కృష్ణగౌడ్, మహేందర్, యాదగిరి, మైసయ్య, సత్యంగౌడ్, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, ఏపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్, కారోబార్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆకులమైలారంలో..

ఆకులమైలారంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఎఫ్ఏ రాజేందర్, కారోబార్ అర్జున్, యువకులు శ్రీనివాస్, రాజు, సంతోష్, విఘ్నేశ్, శేఖర్, రమేశ్, సత్తయ్య, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కందుకూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె కృష్ణగౌడ్, జిల్లా నాయకులు తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్, సాద మల్లారెడ్డి, జిట్టా రాజేందర్‌రెడ్డి, టి.జగదీశ్వర్‌రెడ్డి, మంద పాండు, పున్నం భిక్షపతి, ఎం.వెంకట్‌రెడ్డి, గొర ప్రభాకర్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

'డబుల్' ఇళ్లను స్థానికులకే కేటాయించాలి

బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్



కోర్టుకు హాజరైన శ్రీరాములుయాదవ్

బడంగ్‌పేట్: డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానికులకే ఇవ్వాలని గతంలో ధర్నాలు చేస్తే మాపై అక్రమంగా కేసులు బనాయించారని, ఇలాంటి కేసులు ఎన్ని పెట్టినా ఓర్చుకుంటాం కానీ.. నియోజకవర్గంలో ఇళ్లులేని వారికి డబుల్ బెడ్రూం కేటాయించాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కోర్టుకు హాజరైన అనంతరం మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని మల్లాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంలు స్థానికులను కాదని పాతబస్తీకి చెందిన ఒక వర్గం వారికి కేటాయించడం సరికాదన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎందరో ఇళ్లు లేని పేదలు ఉన్నారని వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇచ్చే వరకు మా పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ అశోక్, నాయకులు తదితరులు ఉన్నారు.



తుక్కుగూడ: కాత్యాయిని దేవిగా మంఖాల్ మహంకాళి అమ్మవారు

వైభవంగా నవరాత్రోత్సవాలు

దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు గురువారం మహేశ్వరం నియోజకవర్గంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం, పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండపాల వద్ద హోమం, కుంకుమార్చన, అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు.

– సాక్షి, నెట్‌వర్క్



మహేశ్వరం: శ్రీకాత్యాయినిదేవి అలంకారంలో అమ్మవారు



మహేశ్వరం: భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



హుడాకాంప్లెక్స్: అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు